సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



నేడే బిగ్‌ఫైట్

రాజంపేట పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో జరుగుతున్న అండర్‌-14 బాలికల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. - 8లో



కోడూరుకు తీరనున్న వరద కష్టాలు

కోడూరు పట్టణానికి వరద కష్టాలు తీరనున్నాయి. గుంజనేరు పరివాహక ప్రాంతాలకు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులను రూ. 50 కోట్ల నిధులతో బుధవారం ప్రారంభించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 189 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సీజ్ చేసిన నిత్యావసర సరుకుల వేలం

రాయచోటి టౌన్ : అక్రమంగా తరలిస్తున్న సమయంలో సీజ్ చేసిన నిత్యావసర సరుకులు (బియ్యం, ఇతర వస్తువులు) బహిరంగ వేలం వేయడానికి సిద్ధం అయినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ఫిబ్రవరి 3వ తేది మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుందని వివరించారు. ఈ వేలం వేస్తున్న సరుకులు పరిశీలన కార్యాలయ పనిదినములలో (కార్యాలయ పని వేళ్లలో) అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. సీజ్ చేసిన సరుకులు 67.201 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు పేర్కొన్నారు.

స్కోరర్‌గా రామకృష్ణకు అవకాశం



వాల్మీకిపురం : ఫిబ్రవరి 2 నుంచి 6వరకు విశాఖపట్నంలో జరిగే ఇండియా, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌కి స్కోరర్‌గా వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ సభ్యుడు బి.రామక్రిష్ణ ఎంపిక అయినట్లు వీసీసీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ తెలిపారు. రామక్రిష్ణ మొదట క్లబ్ క్రీడాకారుడిగా, స్కోరర్‌గా ఉన్నారని, ఏసీఏ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కోరింగ్ పరీక్షలో సెలెక్ట్ అయ్యి 2017 నుండి ఇప్పటి వరకు స్కోరర్‌గా కొనసాగుతున్నాడని పేర్కొన్నారు. ఆరేళ్ల తర్వాత ఇండియా, ఇంగ్లాండ్ టెస్ట్ మ్యాచ్‌కి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్యానల్ నుంచి అవకాశం రావడం చాలా సంతోషకంగా ఉందన్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఏసీఏ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, వీసీసీ సభ్యులు షాహిద్, భరత్, రెడ్డి, లాల, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ



రాయచోటి అర్బన్ : రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ కమిషనర్‌గా ఆర్.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తుండిన గంగాప్రసాద్ తిరుపతి జిల్లా సూళ్లూరు పేట మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంగళగిరి -తాడేపల్లె కార్పొరేషన్‌లో సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

జాతీయ క్రికెట్ పోటీలకు శివకోటి



నందలూరు(రాజంపేట) : మినీ నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు నందలూరు వాసి అలుసూరి శివకోటి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ పోటీలకు తనను ఎంపిక చేయడమే కాకుండా వైస్ కెప్టెన్‌గా నియమించడం పట్ల అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రాజస్తాన్ రాష్ట్రంలోని అజ్మీర్ పట్టణంలో ఈ పోటీలను నిర్వహిస్తారన్నారు. బౌలింగ్, బ్యాటింగ్‌లలో రాణిస్తానని ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తపరిచారు.

రేపు తలనీలాల టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులు సమర్పించే తలనీలాలు మరియు ఒక భాగము కొబ్బరి చిప్పల సేకరణకు సంబంధించి శుక్రవారం సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు .సంవత్సర కాలం పాటు తలనీలాలు, కొబ్బరి చిప్పలకు హక్కు పొందాలనుకున్నవారు తగిన ధరావతు చెల్లించి టెండర్లలో పాల్గొనాలన్నారు. తలనీలాలకు రు.20 లక్షలు, కొబ్బరి చిప్పలకు రు.2లక్షలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు. హెచ్చు పాటదారులకు హక్కులను కల్పిస్తామని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వివరాలు సమర్పించాలి

కడప అగ్రికల్చర్ : గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ ప్రైవేటు లిమిటెడ్‌లో గత నెల 19వ తేదీన అగ్ని ప్రమాదం జరగడంతో నిల్వ ఉంచిన పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అగ్నికి ఆహుతి అయ్యాయని కడప సహాయ మార్కెటింగ్ సంచాలకుడు అజాద్‌వలి తెలిపారు. ఇందులో పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకున్న జిల్లా రైతులు తమ వివరాలను సంబంధిత కోల్డ్ స్టోరేజ్ వారు జారీ చేసిన బాండు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు లోన్, బీమా(నకలు కాపీ) వివరాలతో దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి లేదా తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శికి స్వయంగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా వారం రోజులలోపు సమర్పించాలని తెలిపారు. వివరాలకు దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి 9182361223 నంబరులో లేదా తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి 9182361217 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రగతి వైపు అడుగులు!

- మద్యం, సారా తయారీదారుల కుటుంబాలకు ప్రభుత్వం చేయూత
- ప్రజల జీవితాల్లో మార్పు తెస్తున్న సెబ్, డీఆర్‌డీఏ

పీలేరు: తెలిసో.. తెలియకో అక్రమ మార్గంలో పయనిస్తున్న వారిని గుర్తించి ప్రభుత్వం దారి మళ్లిస్తోంది. ప్రగతి వైపు అడుగులు వేసేలా చేయూతనిస్తోంది. ముఖ్యంగా అక్రమంగా మద్యం, సారా తయారీదారుల కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించి వారిని ప్రగతిబాటలో నడిపించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కలెక్టర్‌తోపాటు సెబ్ జిల్లా ఇన్‌చార్జి ఆధ్వర్యంలో జిల్లాలో నాటుసారా తయారీకి అలవాటు పడ్డ సుమారు 200 కుటుంబాలను గుర్తించారు. వారికి రుణాలు ఇవ్వడంతో వారి కుటుంబాల జీవనశైలిలో మార్పు వచ్చింది. దీంతో చాలా మంది సారా తయారీ వృత్తికి స్వస్తి పలికారు. కొత్తజీవితంలో అడుగు పెట్టారు. దీంతో గ్రామాల్లో సారా తయారీ, విక్రయం పూర్తిగా తగ్గుముఖం పట్టింది.

జీవనోపాధికి విరివిగా రుణాలు...

నాటుసారాకు అలవాటు పడ్డ కుటుంబాలకు జీవనోపాధి కల్పించడానికి సెబ్, డీఆర్‌డీఏ సంయుక్తంగా కృషి చేశాయి. 2023లో 169 కుటుంబాలకు గొర్రెలు, పాడి ఆవుల ఉత్పత్తులకు రూ.1.49 కోట్లు రుణాలు మంజూరు చేశారు. 9 కుటుంబాలకు ఫుడ్ ప్రాసెసింగ్ చేసేందుకు సోలార్ డిహైడ్రేషన్ పరికరాలు, 7 కుటుంబాలకు వ్యవసాయ ఖర్చులకు రూ. 7.72 లక్షలు, మరో ఏడు కుటుంబాలకు ఆటోరిక్షా కొనుగోలుకు రూ. 7.33 లక్షలు ఆర్థిక చేయూతనిచ్చారు. ఐదు కుటుంబాలకు చిల్లర దుకాణాల ఏర్పాటుకు, మూడు కుటుంబాలకు కుట్టుమిషన్లకు రూ.1.90 లక్షలు మంజూరు చేశారు. మొత్తం 200 కుటుంబాలకు రూ.1.78 కోట్లు ఆర్థిక లబ్ధి చేకూర్చారు.



సారా తయారీదారుల కుటుంబాలకు రుణాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గిరీషా (ఫైల్)

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

అక్రమ మద్యం, సారా తయారీలో పట్టుబడ్డ నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. విస్తృతంగా తనిఖీలు చేపట్టడం తోపాటు ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేరస్తుల కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడంతో వారి కుటుంబాల్లో మార్పు తీసుకొచ్చాం.

– రాజ్‌కమల్, జిల్లా సెబ్ ఇన్‌చార్జి

ఆటోతో జీవనం...



గతంలో సారా తయారీ చేసుకుని జీవనం సాగించేవాళ్లం. మా గ్రామంలో సెబ్ అధికారులు మాకు అవగాహన కల్పించి మంచి జీవితంగా గడిపేందుకు రుణాలు ఇస్తామని మారాలని సూచించారు. ఆటో రిక్షా కొనుగోలుకు రూ. 60 వేలు సబ్సిడీతో రూ. లక్ష రుణం మంజూరు చేశారు. దీంతో ఆటో కొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం.

– కిషోర్, మద్రిమాకులపల్లె తాండా, పీలేరు మండలం

కేసుల బాధ తప్పింది...



సారా తయారీ చేసి విక్రయిస్తుండడంతో పలు మార్లు కేసులు నమోదు చేసేవారు. సమాజంలో సరైన గౌరవం కూడా ఉండేది కాదు. మాకు ఆవులు కొనగోలు చేసుకోవడానికి రూ. లక్ష రుణం మంజూరు చేశారు. ఆవులు మేపుకుంటూ పాలతో వచ్చే ఆదాయంతో గౌరవప్రదంగా జీవనం సాగిస్తున్నాం. సారాకు పూర్తిగా స్వస్తి పలికాం.

– శంకర్‌నాయక్, గూడరేవుపల్లె, పీలేరు మండలం

సుపరిపాలన అందించడమే లక్ష్యం

కొత్త కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్

రాయచోటి : అన్నమయ్య జిల్లా ప్రజలకు సుపరిపాలనను అందించడమే లక్ష్యంగా పని చేస్తామని జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.అభిషిక్త్ కిషోర్ అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే తమ లక్ష్యమన్నారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ట్రైబల్ ఏరియా అధికారిగా, జేసీ, మున్సిపల్ నగర్ పాలక కమిషనర్, స్టేట్ ఫైనాన్స్ శాఖలలో పనిచేసిన అనుభవం ఇక్కడ దోహదపడుతుందన్నారు. వెనుకబడిన ప్రాంతమైన అన్నమయ్య జిల్లాను అందరి సహకారంతో అభివృద్ధి వైపు అడుగులు వేయిస్తానన్నారు.

సాదర స్వాగతం...

బాధ్యతలు చేపట్టడానికి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న నూతన కలెక్టర్‌కు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా జరగాలని, నిర్వహణలో చిన్నపాటి తప్పు చేసినా చేయాల్సిన పని చేయకపోయినా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ నోడల్ అధికారులను హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు–2024పై నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారులు వారికి అప్పగించిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ నిష్పక్షపాతంగా జరగాలని సూచించారు. జిల్లా పరిధిలోని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 22న ప్రకటించిన తుది ఎన్నికల జాబితాపై సమీక్షిస్తూ.. ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు ఉండకూడదన్నారు. ఎన్నికలకు సంబంధించి ఆన్‌లైన్ లాగిన్లను అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు, ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



జిల్లాలో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో..

రాయచోటి టౌన్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిషిక్త్ కిశోర్ శ్రీ వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం ఆయనకు స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

వీసీకు పూర్తి సమాచారంతో రావాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డితో ఫిబ్రవరి 1వ తేది గురువారం జరిగే వీడియో కాన్ఫరెన్సుకు సంబంధిత అధికారులు అందరూ పూర్తి సమాచారంతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. రీసర్వే, ఇనామ్, అసైన్మెంట్ ల్యాండ్స్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ, ఎన్ఆర్ఈజీఎస్, తాగునీటి సమస్య తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్సు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి నిధుల మంజూరు

- 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.28.57 వేల కోట్లు మంజూరు
- వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ఆదేశాలు

రాయచోటి : గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించడంతో పాటు ప్రణాళికాబద్ధంగా సత్వరం పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధులను రెండవ విడతగా రూ.28,57,57,117లను ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి నిధులను కేటాయించింది. ఈ నిధులతో పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి సమస్యను పరిష్కరించడం, శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించింది. 50 శాతం నిధులను పారిశుధ్యం పనులకు, మరో 50 శాతం నిధులను తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలని ప్రభుత్వం సూచించింది. అలాగే బేసిక్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇతర శాశ్వత నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మంజూరైన నిధులను సత్వరం చేయాలని సూచించారు. మంజూరైన నిధులను ఖర్చు చేసిన అనంతరం 2023–24 ఆర్థిక సంవత్సరం నిధులను పంచాయతీలకు విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పింది.

హర్షం:

వేసవి సమయం ఆసన్నమవుతున్న సమయంలో ప్రభుత్వం పంచాయతీలకు నిధులు మంజూరు చేయడంతో సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో గ్రామాలలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు సహకారం లభించినట్లు అయిందని చెబుతున్నారు.

నిధులు మంజూరు కాని పంచాయతీలు

జిల్లాలో 501 పంచాయతీలకు గాను 13 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు ఈ పంచాయతీలకు మంజూరు కాలేదు. నందలూరు మండల పరిధిలోని కొండనెల్లూరు, నూకినేనిపల్లి, పుల్లంపేట మండలంలోని బావికాడపల్లి, రామాపురం, సంబేపల్లె మండలం శెట్టిపల్లి, అడవికమ్మపల్లి, టి.సుండుపల్లి మండలంలో గుండ్లపల్లి, సొంటంవారిపల్లి, టి.సుండుపల్లి, ఎర్రమనేనిపాలెం, ఈడిగపల్లి, కోడూరు మండలంలో రెడ్డివారిపల్లి, గుండాలపల్లి పంచాయతీలకు నిధులు మంజూరు కాలేదు.

పక్కాగా కులగణన సర్వే



చిన్నమండెం మండలంలో కులగణన సర్వేను తనిఖీ చేస్తున్న డీపీఓ ధనలక్ష్మి

చిన్నమండెం : కులగణన సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి సూచించారు. బుధవారం మండల పరిధిలోని కేశాపురం గ్రామం దేవలంపేటలో జరుగుతున్న కులగణన సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా కులగణనను పూర్తి చేయాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎంఎల్‌హెచ్‌పీ'ల నియామక ప్రక్రియలో మార్పు

- 2న ఫైనల్ మెరిట్ జాబితా విడుదల
- 5న నియామకాల కౌన్సెలింగ్

కడప రూరల్ : 'ఎంఎల్‌హెచ్‌పీ'ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నియామకాల ప్రక్రియలో మార్పులు జరిగాయి. ఆ మేరకు ఫైనల్ మెరిట్ లిస్ట్, ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ఈ నెల 2వ తేదీన విడుదల చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ జాబితాను హెచ్ఎంఎ ఫడబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కడప పాత రిమ్స్‌లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో స్వయంగా అందజేయవచ్చని లేదా ఎంఎల్‌హెచ్‌పీఆర్‌ఈసీటీ ఆట్ ది రేటాఫ్ జీ మెయిల్.కామ్‌కు ఈ మెయిల్ ద్వారా పంపవచ్చని తెలిపారు. 3వ తేదీన సాయంత్రం 6 గంటలకు ఫైనల్‌గా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. 5వ తేదీన నియామకాల కౌన్సెలింగ్‌ను చేపట్టి అభ్యర్థులకు పోస్టింగ్‌లు కల్పిస్తామని తెలిపారు.

తహసీల్దార్ల బదిలీ

ఎన్నికల నేపథ్యంలో ఆదేశాలు జారీ చేసిన సీసీఎల్‌ఏ



కడప సెవెన్‌రోడ్స్ : రానున్న పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తహసీల్దార్లను బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) జి.సాయిప్రసాద్ బుధవారం ప్రొసీడింగ్స్ జారీ చేశారు. సొంత జిల్లాకు చెందిన వారు, ఒకేచోట మూడేళ్లపాటు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని వేరే ప్రాంతాలకు మార్చారు. జూన్ 30వ తేదీ నాటికి మూడేళ్ల సర్వీసు పూర్తి కానివారు, రిటైర్‌మెంట్ అయ్యే వారిని బదిలీల నుంచి మినహాయించారు. మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి కాని బ్రహ్మంగారిమఠం మండల తహసీల్దార్ బి.సువర్ణాదేవి, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.జ్ఞానేశ్వరి, రిటైర్‌మెంట్‌కు దగ్గరున్న కలెక్టరేట్ సూపరింటెండెంట్ జి.వెంకటరమణ, హెచ్–సెక్షన్ సూపరింటెండెంట్ ఎల్.ప్రభాకర్‌రెడ్డి, నందలూరు తహసీల్దార్ వై.సత్యానందం, రాయచోటి ఆర్డీఓ కార్యాలయ ఏఓ వి.వెంకటసుబ్బయ్యలను బదిలీల నుంచి మినహాయించారు. జిల్లాలో మిగిలిన తహసీల్దార్లను నాలుగో జోన్‌లోని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి వైఎస్సార్ జిల్లాకు కేటాయించారు.

వైఎస్సార్ జిల్లాకు ఇతర జిల్లాల నుంచి వచ్చే తహసీల్దార్లు

పేరు	ప్రస్తుత స్థానం
కె.శ్రీధర్	అనంతపురం కలెక్టరేట్
జిలానీ	పుట్టపర్తి (అనంతపురం)
సి.కరుణాకర్	బుక్కపట్నం (అనంతపురం)
జి.సౌజన్యలక్ష్మి	పరిగి (అనంతపురం)
ఎం.వేణుగోపాల్	రొళ్ల (అనంతపురం)
జమాలుల్లాఖాన్	అగలి (అనంతపురం)
పి.శివరాం	నగిరి (చిత్తూరు)
ఎస్ఎస్ కృష్ణకుమార్	కుప్పం (చిత్తూరు)
కె.అమర్‌నాథ్	రొంపిచెర్ల (చిత్తూరు)
ఇ.అమర్‌నాథ్	గంగవరం (చిత్తూరు)
కె.బెన్నురాజ్	బంగారు పాలెం (చిత్తూరు)
ఎం.భగవతి	నింద్ర (చిత్తూరు)
కె.కుప్పయ్య	తిరుపతి (చిత్తూరు)
పి.భారతి	తిరుపతి (చిత్తూరు)
వీఎస్‌వీఆర్ కృష్ణ	డక్కిలి (చిత్తూరు)
ఎం.రోశయ్య	నాయుడుపేట (చిత్తూరు)
ఎస్.శివప్రసాద్	ఏర్పేడు (చిత్తూరు)
యు.మధుసూదన్‌రావు	పిచ్చాటూరు (చిత్తూరు)
ఎస్.ప్రమీల	నారాయణవనం (చిత్తూరు)
కె.వెంకట రమణ	తిరుపతి (చిత్తూరు)
పి.శిరీష	చంద్రగిరి (చిత్తూరు)
కేపీ భాగ్యలక్ష్మి	పాకాల (చిత్తూరు)
ఐ.సుబ్రమణ్యం	వడమాల పేట (చిత్తూరు)
వై.రమేష్‌బాబు	తిరుపతి (చిత్తూరు)
ఆర్.వెంకటలక్షుమ్మ	తిరుపతి (చిత్తూరు)
ఎస్.మహేశ్వరిబాయి	సంబేపల్లె
కె.ధనుంజయులు	పీలేరు (చిత్తూరు)
ఎం.భీమేశ్వరరావు	కురబలకోట (చిత్తూరు)
సి.శ్రీనివాసులు	ములకలచెరువు (చిత్తూరు)
జె.రాము	పెద్దమండెం (చిత్తూరు)
బి.శ్రీనివాసులు	నంద్యాల (కర్నూలు)
డి.రవికుమార్	ఉయ్యాలవాడ (కర్నూలు)
బీవీఎన్ విద్యాసాగర్	డోన్ (కర్నూలు)
వై.నరేంద్రనాథరెడ్డి	బేతంచర్ల (కర్నూలు)
ఎస్.ప్రకాశ్‌బాబు	మిడుతూరు (కర్నూలు)
ఎన్.రవికుమార్	బండి ఆత్మకూరు (కర్నూలు)
జి.ఉమారాణి	ఆత్మకూరు (కర్నూలు)
సి.చంద్రశేఖర్‌వర్మ	కౌతాళం (కర్నూలు)
పి.రాజేశ్వరి	కలెక్టరేట్ కర్నూలు
ఐ.విజయశ్రీ	కర్నూలు
వెంకటేశ్‌నాయక్	దేవనకొండ (కర్నూలు)
ఎస్.వెంకట రమణ	పెద్దకడుబూరు (కర్నూలు)
ఇ.వెంకటలక్ష్మి	ఆదోని (కర్నూలు)
టీవీ రమేష్‌బాబు	కలెక్టరేట్ కర్నూలు
ఎ.నిత్యానందరాజులు	కృష్ణగిరి (కర్నూలు)
వి.పుల్లారెడ్డి	ఓబులవారిపల్లె (అన్నమయ్య)

అన్నమయ్య జిల్లాకు ఇతర జిల్లాల నుంచి వచ్చే తహసీల్దార్లు

ఎస్.ఈశ్వరమ్మ	శింగనమల
ఎస్.రమాదేవి	బుక్కరాయసముద్రం
బి.లక్ష్మీనాయక్	పెద్దపప్పూరు
ఎస్.మహబూబ్‌బాష	గుత్తి
బి.అనిల్‌కుమార్	వజ్రకరూర్
ఎస్.నాయజ్ అహ్మద్	కంబదూరు
పి.విజయకుమారి	కుందుర్పి
ఎస్.బ్రహ్మయ్య	గుమ్మగట్ట
ఎస్‌పీ శ్రీనివాసులు	బొమ్మనహాళ్
ఆర్.ఇస్‌బసతన్	జీడీ నెల్లూరు
శేషగిరిరావు	పులిచెర్ల
షేక్ జరీన	సత్యవేడు
బి.శ్రీనివాసులు	అవుకు
ఆర్.శివరాముడు	కర్నూలు రూరల్
బి.జయన్న	కోడుమూరు
ఆర్.గోవింద్‌సింగ్	ఆదోని

వైఎస్సార్ జిల్లానుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు

పేరు	పనిచేస్తున్నది	బదిలీ అయిన జిల్లా
కె.విజయ్‌కుమార్	కలెక్టరేట్ ఏఓ, కడప	అనంతపురం
పి.శ్రీనివాసరెడ్డి	కలెక్టరేట్, కడప	చిత్తూరు
టి.వెంకట రమణ	కలెక్టరేట్, కడప	నంద్యాల
ఎస్.బద్రుజమ	కలెక్టరేట్, కడప	శ్రీ సత్యసాయి
పి.శరత్	కలెక్టరేట్, కడప	తిరుపతి
జి.అక్బర్‌బాష	జమ్మలమడుగు, ఆర్డీఓ ఆఫీసు	శ్రీ సత్యసాయి
టి.ఈశ్వరయ్య	జమ్మలమడుగు, ఆర్డీఓ ఆఫీసు	అనంతపురం
ఎం.వెంకటస్వామి	కడప ఆర్డీఓ ఆఫీసు	శ్రీ సత్యసాయి
ఆర్.శేషారాంసింగ్	కడప ఆర్డీఓ ఆఫీసు	అనంతపురం
ఏపీ రమణమ్మ	బద్వేలు ఆర్డీఓ ఆఫీసు	నంద్యాల
పి.విజయకుమారి	పులివెందుల ఆర్డీఓ ఆఫీసు	నంద్యాల
జీవన్ చంద్రశేఖర్	కడప అర్బన్	నంద్యాల
ఎం.శ్రీవాణి	అట్లూరు	తిరుపతి
జీవీ మధురవాణి	బి.కోడూరు	నంద్యాల
వి.గంగయ్య	పోరుమామిళ్ల	తిరుపతి
జి.రవీంద్రారెడ్డి	కలసపాడు	నంద్యాల
డి.దామోదర్‌రెడ్డి	గోపవరం	నంద్యాల
బి.రామచంద్రుడు	కాశినాయన	నంద్యాల
బి.అనూరాధ	మైదుకూరు	కర్నూలు
ఏఎస్ నజీర్ అహ్మద్	ప్రొద్దుటూరు	నంద్యాల
బి.గురప్ప	జమ్మలమడుగు	నంద్యాల
ఎం.ఇందిరా రాణి	రాజుపాలెం	అనంతపురం
కె.శోభన్‌బాబు	కొండాపురం	అనంతపురం
జి.వెంకటేశ్వర్లు	ముద్దనూరు	అనంతపురం
డి.తిరుపతయ్య	మైలవరం	నంద్యాల
జ్యోతి రత్నకుమారి	పెద్దముడియం	నంద్యాల
పి.రామకుమారి	దువ్వూరు	శ్రీ సత్యసాయి
ఎ.నాగేశ్వరరావు	ఎర్రగుంట్ల	తిరుపతి
కె.మాధవకృష్ణారెడ్డి	పులివెందుల	నంద్యాల
వి.రాజసింహ నరేంద్ర	చక్రాయపేట	తిరుపతి
ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి	వేంపల్లె	చిత్తూరు
ఎం.లక్ష్మీనారాయణ	లింగాల	శ్రీ సత్యసాయి
వి.వెంకట సుబ్బయ్య	వేముల	సత్యసాయి
డి.మహబూబ్‌బాష	సింహాద్రిపురం	అన్నమయ్య
ఎం.బాలనరసింహులు	తొండూరు	సత్యసాయి
బి.శివరామిరెడ్డి	కడప	అనంతపురం
అలీఖాన్	చెన్నూరు	తిరుపతి
టి.సరస్వతి	కమలాపురం	శ్రీ సత్యసాయి
డి.ఉదయభాస్కర్‌రాజు	పెండ్లిమర్రి	తిరుపతి
పి.శంకర్‌రావు	వల్లూరు	తిరుపతి
ఎంవీఎస్ నారాయణరెడ్డి	సీకే దిన్నె	తిరుపతి
వై.ఉదయభారతి	ఖాజీపేట	తిరుపతి
ఎంఏ రమేష్	ఒంటిమిట్ట	శ్రీ సత్యసాయి
బి.లక్ష్మిదేవి	సిద్ధవటం	తిరుపతి
ఎ.తులశమ్మ	రాజంపేట ఆర్డీఓ ఆఫీసు	నంద్యాల
ఎంవీ సుబ్రమణ్యంరెడ్డి	రాజంపేట	చిత్తూరు
బి.శ్రీధర్‌రావు	పెనగలూరు	తిరుపతి
ఎస్.ఉదయశంకర్‌రాజు	లక్కిరెడ్డిపల్లె	శ్రీ సత్యసాయి
ఎం.దైవాదీనం	గాలివీడు	చిత్తూరు
ఎం.శ్రీరాములు నాయక్	చిన్నమండెం	తిరుపతి

క్లుప్తంగా

యువతి ఆత్మహత్య



భార్య విద్యారాణి మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త చంద్రశేఖర్

మదనపల్లె సిటీ : కుటుంబ సమస్యల కారణంగా ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె పట్టణం టీచర్స్ కాలనీలో బుధవారం జరిగింది. టీచర్స్ కాలనీకి చెందిన చంద్రశేఖర్ స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో మాంసం దుకాణం నిర్వహిస్తున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో భార్య విద్యారాణి(38) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం



సారాతోపాటు నిందితుడిని అరెస్ట్ చేసిన సెబ్ అధికారులు

కేవీపల్లె : మండలంలోని దిగువ వగళ్లతాండా వద్ద సెబ్ సిబ్బంది దాడులు నిర్వహించి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పీలేరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దిగువ వగళ్ల తాండాకు చెందిన బి. ద్వారకనాయక్ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ దాడిలో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

బి.కొత్తకోట : మండలంలోని గోళ్లపల్లె దళితవాడకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తి నాటు సారా అమ్ముతుండగా బుధవారం అరెస్టు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మారుతిరెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడే బిగ్‌ఫైట్

సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు రంగం సిద్ధం

సెమీ ఫైనల్‌లో తలపడే జట్లు ఇవే
ఉత్తర ప్రదేశ్ v/s హర్యానా
రాజస్థాన్ v/s మహారాష్ట్ర



హోరా హోరీగా తలపడుతున్న క్రీడాకారులు



విజేత జట్టుకు ప్రదానం చేయనున్న కప్

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో జరుగుతున్న అండర్-14 బాలికల జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ పోటీల్లో భాగంగా బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో పలు జట్లు సెమీఫైనల్‌లో బెర్త్ కోసం హోరాహోరీగా పోరాడాయి. అయితే మహారాష్ట్ర-పంజాబ్ మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర 25 పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. అలాగే ఢిల్లీ-రాజస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 22 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొంది సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. ఛత్తీస్‌ఘడ్-ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 20 పాయింట్ల ఆధిక్యంతో సెమీస్‌కి చేరుకుంది. హర్యానా-తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 28 పాయింట్ల ఆధిక్యతతో విజయదుందుభి మోగించి సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్‌కు చేరుకున్న జట్లన్నీ మొదటి నుంచి దూకుడుగా ఆడుతూ వచ్చాయి. దీంతో సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు హైఓల్టేజీలో జరిగే అవకాశం ఉంది. కాగా గురువారం ఉదయం 8 గంటల నుంచి సెమీఫైనల్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. సెమీఫైనల్ మ్యాచ్‌లు పూర్తికాగానే ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

రైతు ఆత్మహత్య



వెంకట్రమణ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : భూతగాదాల కారణంగా మండలంలోని మద్దయ్యగారిపల్లికి చెందిన ఎ.వెంకట్రమణ (62) అనే రైతు విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దాయాదుల మధ్య తలెత్తిన భూ వివాదాలే ఇందుకు కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. భూముల విషయమై కోర్టులో కేసు నడుస్తుండటంతో తనకు న్యాయం జరుగుతుందో లేదోనని భయాందోళనకు లోనై ఈ చర్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఒంటిమిట్టలో భారీ అక్రమ మద్యం పట్టివేత



అక్రమ మద్యం, నిందితులతో ఎస్ఐ మధుసూదన్ రావు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచపల్లెలో మంగళవారం రాత్రి భారీగా మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు బుధవారం ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కచ్చితమైన సమాచారం మేరకు రాచపల్లిలోని మౌలాస్వామి దర్గా వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుంకేసుల గంగాధర్ (29), సుంకేసుల గంగయ్య (33)లను అదుపులోకి తీసుకొని వారివద్ద ఉన్న 151 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

డీసీసీ బ్యాంకులో చలానా రిజిస్ట్రేషన్ సౌకర్యం

కడప అగ్రికల్చర్ : కడప డీసీసీ బ్యాంకులో ఇక నుంచి రిజిస్ట్రేషన్ చలానా తీసుకోవచ్చని ఈ సౌకర్యాన్ని డీసీసీ బ్యాంకు ఖాతాదారులు మాత్రమే కాకుండా అందరూ ఉపయోగించుకోవచ్చని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైరపర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. బుధవారం కడపలోని డీసీసీ బ్యాంకు హెడ్ ఆఫీస్‌లో బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్‌తో కలిసి ఈ- రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని ప్రారంభించారు.

ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి!

ప్రభుత్వ ఆతిథ్యంపై సంతోషం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



ఫుడ్ సూపర్ అంటున్న క్రీడాకారులు



బహుత్ అచ్ఛాహై అంటున్న ఇతర రాష్ట్రాల కోచ్‌లు, మేనేజర్‌లు

రాజంపేట టౌన్ : క్రీడలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. రాజంపేటలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి తరలి వచ్చిన వివిధ రాష్ట్రాల క్రీడాకారులకు, క్రీడా అధికారులు అందిస్తున్న ఆతిథ్యం, సౌకర్యాల కల్పనపై క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు ఎనలేని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అనేక రాష్ట్రాల్లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల సందర్భంగా క్రీడాకారులకు అందించే ఆహారం, సౌకర్యాల కల్పన విషయంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవని, అందువల్ల క్రీడాకారులు చాలా ఇబ్బందులు పడుతుంటారని కోచ్‌లు, మేనేజర్లు చెబుతున్నారు. అయితే టిఫిన్, భోజనం, వసతి సౌకర్యాల కల్పన వంటి విషయాల్లో మిగతా రాష్ట్రాలకంటే ఏపీ ప్రభుత్వం భిన్నంగా ఉందని వారు చెప్పుకొచ్చారు.

ప్రత్యేకమైన వంటకాలు

ఏదైనా రాష్ట్రంలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరిగితే అక్కడి ప్రభుత్వం అన్ని రాష్ట్రాల క్రీడాకారులకు తమ రాష్ట్ర ఆహారపు అలవాట్ల మేరకు ఆహార పదార్థాలను ఏర్పాటు చేస్తుంది. అయితే రాజంపేటలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులకు అధికారులు ఆయా రాష్ట్రాల ఆహారపు అలవాట్ల మేరకు ఆహార పదార్థాలను అందిస్తుండటం విశేషం. నార్త్ ఇండియన్ క్రీడాకారులకు వారి ఆహారపు అలవాట్ల మేరకు టిఫిన్‌లో బ్రెడ్‌జామ్, ఎగ్, బజ్జీ, అరటి పండు ఇస్తున్నారు. ఇక సౌత్‌ఇండియన్ క్రీడాకారులకు ఇడ్లీ, ఉప్మా, పొంగల్, కిచిడీ, బిస్మిల్లాబాత్‌లలో ఏదైనా రెండు రకాల టిఫిన్‌లతో పాటు వడను ఇస్తున్నారు. ఇక పాలు, టీని అందుబాటులో ఉంచుతుండటంతో ఎవరికి నచ్చినది వారు తాగుతున్నారు. మధ్యాహ్నం నార్త్ ఇండియన్స్‌కు రోటీ, వెజిటబుల్ కర్రీ లేదా దాల్ ఇస్తున్నారు. దీనికి తోడు రెండురకాల ప్రత్యేకమైన రైస్, అందుకు తగ్గట్లు కర్రీ ఇస్తున్నారు. అలాగే వైట్‌రైస్ అందులోకి రసం, పెరుగు, వడియాలను పెడుతున్నారు. రాత్రి రోటీ విధిగా చికెన్, వెజిటబుల్ కర్రీలతో పాటు వైట్‌రైస్, కర్డ్‌రైస్‌ను అందిస్తున్నారు. దీంతో క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు టిఫిన్, భోజన సౌకర్యాల పట్ల ఎనలేని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వసతి విషయంలో కూడా అధికారులు ఏమాత్రం రాజీ పడకుండా వసతి సౌకర్యం కల్పించారు.

ఉయ్ ఆర్ ఫుల్ హ్యాపీ



సౌత్ ఇండియా వాళ్ల ఆహారపు అలవాట్లు వేరుగా ఉంటాయి. అందువల్ల మేము ఇక్కడ ఫుడ్‌కు ఇబ్బంది పడాల్సి వస్తుందనుకున్నాం. కానీ ఇక్కడి ప్రభుత్వం మా రాష్ట్ర ఆహారపు అలవాట్ల మేరకు మాకు మూడు పూటలా ఫుడ్ అందించే ఏర్పాట్లు చేసింది. అందువల్ల మేము మా రాష్ట్రంలోనే ఉన్నట్లు అనిపిస్తుంది. ఉయ్ ఆర్ ఫుల్ హ్యాపీ.

దీపికాదాంగి, మధ్యప్రదేశ్

థ్యాంక్యూ సీఎం సాబ్



నేను ప్రతి ఏడాది జాతీయ స్థాయి పోటీల సందర్భంగా వివిధ రాష్ట్రాలకు వెళుతుంటాను. అయితే ఏపీలో లాగా మరెక్కడ కూడా ఫుడ్, అకామిడేషన్ సౌకర్యాలు కల్పించలేదు. ఏపీ ప్రభుత్వం ఈ విధమైన ఏర్పాట్లు చేస్తుందని అస్సలు ఊహించలేదు. థ్యాంక్యూ సీఎం సాబ్.

సుచ్చాసింగ్, కబడ్డీ మేనేజర్, పంజాబ్

మన రాష్ట్రం గురించి గొప్పగా చెప్పుకోవాలి



తెలుగువారి ప్రేమ, అభిమానాలను ఇతర రాష్ట్రాల వారు గొప్పగా చెప్పుకోవాలి. మంచి ఆహారం, సౌకర్యవంతమైన వసతి కల్పించడం వల్ల మన ప్రభుత్వ పనితీరు గురించి ఇతర రాష్ట్రాల ప్రజలు వారి ప్రాంతంలో చెప్పుకుంటారు. అందువల్ల ఫుడ్ విషయంలో ఏమాత్రం రాజీపడలేదు. అందువల్లే ప్రతి ఒక్కరు హ్యాపీగా ఫీలవుతున్నారు. ఇంత కంటే ఏమికావాలి.

షేక్ హబీబ్, ఫుడ్‌కమిటీ ప్రతినిధి, రాజంపేట

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- న్యాయం చేయాలని ధర్నాకు దిగిన గుత్తి కూలీలు
- గంటసేపు స్తంభించిన ట్రాఫిక్
- పట్టణ పోలీసు స్టేషన్‌కు పెద్ద ఎత్తున చేరుకున్న కూలీలు
- ప్రమాదంపై సీసీ ఫుటేజీల పరిశీలన
- మృతుడిపైనే కేసు నమోదు చేసిన పోలీసులు



ప్రమాద స్థలంలో యువకుడి మృతదేహం

రాజంపేట : రాజంపేట పట్టణం పాతబస్టాండు రోడ్డులోని శివాలయం క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణానాయక్ అలియాస్ చిన్న(35) అనే యువకుడు దుర్మరణం చెందాడు. అనంతపురం జిల్లా గుత్తిబాట తండా గ్రామానికి చెందిన కృష్ణనాయక్, తన తండ్రి భీమానాయక్‌తో కలిసి జీవనోపాధికి కూలిపనులు చేసుకునేందుకు రాజంపేటకు వలస వచ్చారు. కృష్ణా నాయక్ బైకుపై అమ్మవారిశాల మలుపు నుంచి పాతబస్టాండుకు వస్తుండగా ఎదురుగా స్కూలు వ్యాను వస్తున్న క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ధర్నాకు దిగిన గుత్తి కూలీలు..

కృష్ణానాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని గుత్తికి చెందిన కూలీలు ధర్నాకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న మృతుని సంబంధీకులు బోరున విలపిస్తూ రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించిపోయింది. పట్టణ సీఐ మద్దయ్య ఆచారి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. కూలీలు పట్టణ పోలీసు స్టేషన్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

సీసీ కెమెరా ఫుటేజీల పరిశీలన

కృష్ణానాయక్ మృతికి రాజు విద్యా సంస్థల స్కూల్ వ్యాన్ కారణమని గుత్తి కూలీలు ధర్నాకు దిగిన నేపథ్యంలో ప్రమాదంపై వివాదం నెలకొంది. దీంతో సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. చివరికి అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ తదితర కారణాలతో ప్రమాదం జరిగిందని పోలీసులు మృతునిపైనే కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని సీఐ మద్దయ్య ఆచారి వెల్లడించారు.

దంపతులపై నాటు తుపాకీతో దాడి

వివాదానికి దారి తీసిన కౌలు పొలం





నాటుతుపాకీతో దాడి చేయడంతో గాయపడిన మహిళ, రెడ్డిశేఖర్‌రెడ్డి

కురబలకోట : దంపతులపై నాటు తుపాకీతో ఓ వ్యక్తి దాడి చేసి గాయపరచిన సంఘటన బుధవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో జరిగింది. ముదివేడు ఎస్ మల్లికార్జున రెడ్డి కథనం మేరకు..మండలంలోని దిన్నెమీదపల్లె వద్ద మదనపల్లెకు చెందిన కృష్ణమూర్తి పొలం ఉంది. దీనిని పక్కనే ఉన్న బద్దిపల్లెకు చెందిన మల్లికార్జున రెడ్డికి కౌలుకు ఇచ్చాడు. అతను మొక్కజొన్న వేశాడు. అదే పొలంలో కొంత భాగం దిన్నెమీదపల్లెకు చెందిన దంపతులు సరస్వతమ్మ (55), జి. రెడ్డిశేఖర్ రెడ్డి (55) జొన్న పంట వేశారు. వీరు గతంలో ఈ పొలాన్ని కౌలుకు చేశారు. దీన్ని ఆసరాగా తీసుకుని వీరి పొలం పక్కనే ఉన్న కారణంగా కొంత భాగంలో మొక్కజొన్న వేశారు. తనకు కౌలుకు ఇచ్చిన పొలంలో మొక్కజొన్న ఎలా వేస్తారని మల్లిఖార్జున రెడ్డి వారిని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి వివాదానికి దారితీసింది. దీంతో మల్లికార్జునరెడ్డి తన వద్ద ఉన్న నాటు తుపాకీతో దంపతులపై దాడి చేశాడు. ఇందులో మందు గుండు లేదు. ఖాళీ తుపాకీతో కొట్టి దాడి చేయడంతో దంపతులకు గాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన దంపతులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిపై దాడి చేసిన మల్లికార్జున రెడ్డి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో యువకుడి అరెస్టు

కడప అర్బన్ : కడప నగరం సాయిపేటలోని ఏ-1 నగర్‌లో గత నెల 27న షేక్ అబుబకర్ సిద్దిక్‌పై కత్తితో దాడిచేసిన కేసులో షేక్ ఆర్ఫిద్‌ను అరెస్ట్ చేసినట్లు కడప టూటౌన్ సీఐ తబ్‌రేజ్ తెలిపారు. నిందితుడు షేక్ ఆర్ఫిద్ జులాయిగా తిరుగుతూ అందరినీ బెదిరిస్తూ ఉండేవాడు. ఈక్రమంలో గత నెల 24న షేక్ అబుబకర్ సిద్దిక్‌పై దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి, బుధవారం అరెస్ట్ చేశామన్నారు. నిందితుడిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

సంబేపల్లె : మండలంలోని గురిగింజకుంట గ్రామంలో ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.36 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి గురిగింజకుంట గ్రామంలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

పుల్లంపేట : మండల పరిధిలోని రామక్కపల్లి గ్రామానికి చెందిన గుండ్రా లక్ష్మీనారాయణ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపినందుకు కోర్టు జైలు శిక్ష విధించింది. నిందితుడిని బుధవారం నందలూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి పదిరోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్ జైలుకు తరలించామన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర ప్రగతి

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి సాధ్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కలకడ మండలం ఎనుగొండపాలెం పంచాయతీ బద్దిరెడ్డిగారిపల్లికి చెందిన పట్టాభి, నరసింహులు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నవరత్నాల ద్వారా ప్రజలకు నేరుగా పథకాలను వారి ఖాతాల్లో జమ చేస్తూ.. ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్ నాయుడు, మోహన్ రాజు, ఈశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిల్డప్ బాబాయ్‌తో ప్రాణహాని

చంపిస్తానని బెదిరిస్తున్న అమరనాథ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన రాయల్‌గణి



టీడీపీ నాయకుడు అమరనాథ్‌తో ప్రాణహాని ఉందంటూ డీఎస్పీ కేశప్పకు ఫిర్యాదుచేస్తున్న రాయల్‌గణి

మదనపల్లె : టీడీపీ నాయకుడు కొడిగుండ్ల అమరనాథ్‌తో తనకు ప్రాణహాని ఉందని, అతడి అక్రమాల చిట్టా విప్పినప్పటి నుంచీ తనను చంపేందుకు కిరాయిరౌడీలకు సుపారీ ఇచ్చినట్లుగా ఫోన్‌చేసి బెదిరిస్తున్నాడని రాయల్‌గణి ఫిర్యాదుచేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి డీఎస్పీ కేశప్పను బుధవారం కలిసి వాయిస్ రికార్డులు, ఫోన్‌కాల్ డేటా, వాట్సప్ చాట్ తదితర సాక్ష్యాలను చూపి అమరనాథ్ తనను బెదిరిస్తున్న వైనంపై వివరించాడు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉంటున్న అమరనాథ్ స్వస్థలం తంబళ్లపల్లె నియోజకవర్గం, పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రమని, గతంలో అమరనాథ్‌పై తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అంతరాష్ట్ర నేరస్తుడిగా పలుకేసులు నమోదై ఉన్నాయన్నారు. కాశ్మీర్, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల్లో రైతులను మోసగించి మామిడి, ఆపిల్, చీనికాయలు, రేషన్‌బియ్యం, వేరుశెనగకాయలు, లారీ లోడులు అపహరించిన, చెక్‌బౌన్స్ కేసులు అనేకం ఉన్నాయన్నారు. రెండునెలల క్రితం రాజకీయంగా తాను నిలదొక్కుకోవాలనుకుంటున్నానని, తనకు సహాయం చేయాలని అభ్యర్థించగా, తానే ముందుండి అతడి వాహనాలకు డీజిల్, డ్రైవర్లు, అనుచరులకు భోజన, వసతి ఖర్చులకు సుమారు రూ.2లక్షల వరకు ఖర్చుచేశానని చెప్పుకొచ్చాడు. తాను ఖర్చుపెట్టిన డబ్బులను ఇవ్వమని అడిగితే.. మదనపల్లె ఎమ్మెల్యేగా గెలిచాక నీ అప్పు తీరుస్తానని, అంతవరకు తనను ఇబ్బంది పెడితే హత్య చేయిస్తానని బెదిరించాడన్నారు. దీంతో టీడీపీ నాయకుడి ముసుగులో అతడు ప్రజలకు చేస్తున్న మోసాలను మీడియా ముందు బయటపెట్టానన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం తనకు ఫోన్‌చేసి తనను చంపేందుకు సుపారి ఇచ్చానని చెప్పాడన్నారు. వాయిస్‌మెసేజ్‌లన్నింటినీ డీఎస్పీకి ఇచ్చానని, ఆయన ఆదేశాల మేరకు టూటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కోడూరుకు తీరనున్న వరద కష్టాలు

- రూ. 50 కోట్లతో గుంజన ఏరు ప్రొటెక్షన్ వాల్ పనులు ప్రారంభం
- పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



భూమిపూజ చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిల సహకారంతో రైల్వేకోడూరు నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. పట్టణానికి ఎంతో అవసరమైన గుంజనేరు పరివాహక ప్రాంతాలకు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణాన్ని రూ. 50 కోట్ల నిధులతో ప్రారంభించామని ఆయన బుధవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డితో కలిసి గుంజనేరు ప్రొటెక్షన్ వాల్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ ప్రభుత్వాలు పట్టించుకోనప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోడూరుపై ప్రత్యేక దృష్టిపెట్టి నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో ఇక్కడి ప్రజలకు వరద కష్టాలు తీరయనున్నాయని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.